క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం, పెద్దిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



రొళ్లలో విరబూసిన బ్రహ్మకమలాలు

రొళ్ల: మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డులో నివాసం ఉంటున్న పద్మజ, వెంకటరమణప్ప దంపతుల ఇంటి ఆవరణలో మంగళవారం రాత్రి బ్రహ్మ కమలాలు వికసించాయి. చుట్టు పక్కల నివాసం ఉన్నవారు తరలివచ్చి బ్రహ్మ కమలాలను వీక్షించి పూజలు చేశారు.

10న మండల సర్వసభ్య సమావేశం

అమరాపురం: మండల సర్వసభ్య సమావేశాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10న ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్నలు తెలిపారు. మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

బెంగళూరు వెళ్లి పింఛన్ అందజేత



బెంగళూరులోని ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమేష్

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు గ్రామ సచివాలయం పరిధిలోని చిట్నడకు గ్రామానికి చెందిన గురులింగప్ప అనారోగ్యంతో బెంగళూరు నగరంలోని ఓ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న వలంటీర్ రమేష్ బుధవారం సొంత ఖర్చుతో బెంగళూరు వెళ్లి గురులింగప్ప వృద్ధాప్య పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పుష్పయాగం



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

హిందూపురం అర్బన్: పట్టణంలోని బాలాజీనగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో బుధవారం అధిక శ్రావణం, శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రావణా నక్షత్రం పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో భక్తులు పుష్పయాగం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం సొంత వ్యయంతో శ్రీవారికి కిరీటాన్ని బహూకరించారు.

భూసేకరణపై రైతులతో సమావేశం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

హిందూపురం అర్బన్: జాతీయ రహదారి 716జీ రోడ్డు విస్తరణలో భాగంగా బుధవారం సాయంత్రం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ రైతులతో సమావేశమయ్యారు. చలివెందుల, మలగూరు, శ్రీకంఠపురం గ్రామాలకు చెందిన రైతులతో బీరేపల్లి, చలివెందుల , కగ్గల్లు లలో గ్రామ సభలు నిర్వహించారు. రహదారి పక్కనే భూములున్నాయని పరిహారం ఎక్కువ ఇవ్వాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

మడకశిర: పట్టణంలోని చౌటిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యతో పాటు ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

దొంగకు దేహశుద్ధి

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీలో బుధవారం పట్ట పగలే ఓ దొంగ కాలనీలో దొంగతనానికి ప్రయత్నించాడు. అయితే స్థానిక యువకులకు దొంగ దొరకడంతో దేహశుద్ధి చేశారు. అప్పటికే అతను తప్పతాగి ఉండటంతో వదిలేశారు.

త్రినేత్రం

- 'పురం'లో ఎటు చూసినా నిఘా నేత్రాలు
- నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగమంటున్న పోలీసులు

హిందూపురం అర్బన్: జిల్లాలోనే హిందూపురం ప్రత్యేకం. జనాభాతో పాటు పరిశ్రమలు కూడా ఇక్కడ అధికమే. ఈ నేపథ్యంలోనే నేరాల నియంత్రణతో పాటు ప్రధాన రోడ్లు, పారిశ్రామిక వాడల్లో పర్యవేక్షణకు పోలీసులు నిఘా నేత్రాలను ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలో 200కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఏం జరిగినా ఠక్కున పోలీసులకు తెలిసిపోతోంది.

పారిశ్రామిక వాడలోనూ...

హిందూపురం పట్టణానికి మండలంలోని తూమకుంట పారిశ్రామికవాడ 5 కిలో మీటర్ల దూరంలో ఉంది. అక్కడ 120 పరిశ్రమలకు పైగా ఉన్నాయి. నిత్యం పోలీసులు పర్యవేక్షించాలంటే కష్టమే. దీంతో అక్కడ ఈ మధ్యనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో స్టేషన్ నుంచే పర్యవేక్షణ చేస్తుండటంతో భద్రతలకు సంబంధించి ఇబ్బందులు తప్పాయి.

సులువుగా మానిటరింగ్

హిందూపురం పెద్ద పట్టణం కావడంతో నిత్యం పట్టణానికి వచ్చివెళ్లేవారి సంఖ్య కూడా ఎక్కువే. దీంతో పట్టణంలో ప్రధాన కూడళ్లు, బస్టాండ్‌లు, ప్రధాన వీధుల్లో నిఘా నేత్రాలు (సీసీ కెమెరాలు) పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది. పట్టణంలో ప్రధానంగా ఊరేగింపులు, ఉత్సవాలు జరిగినప్పుడు పోలీస్ అధికారులు సీసీ కెమెరాలపై ఆధారపడే మానిటరింగ్ చేస్తున్నారు. దీంతో క్షణాల్లో ఎక్కడ ఏం జరిగినా నియంత్రించడం కూడా సులువవుతోంది.

200కు పైగా సీసీ కెమెరాలు

పట్టణంలోకి వచ్చే పరిగి రోడ్డు, లేపాక్షి రోడ్డు (రైల్వే), బైపాస్‌రోడ్డు, గురునాథ్ సర్కిల్, తెలుగుతల్లి విగ్రహం, బెంగళూరు రోడ్డులలో సీసీ కెమెరాలతో నిత్యం నిఘా ఉంచారు. పరిగి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లేదారిలో, మెయిన్‌బజార్‌పై సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే హిందూపురం గ్రామీణ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలో కూడా ఇటీవలే సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. ఇలా 200కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అందులో కొన్ని బుల్లెట్ కెమెరాలు, మూడు పీటీ కెమెరాలు ఉన్నాయి. 30 ఇన్‌టు 360 మీటర్ల జూమ్‌తో పనిచేసే కెమెరాలు కూడా ఉన్నాయి.

ఆలయాలు, దుకాణాల వద్ద...

పట్టణంలోని ప్రధాన ఆలయాలైన పేట వెంకటరమణ స్వామి దేవాలయం, అయ్యప్పసామి, గాయిత్రీదేవి, శివాలయం, బాలాజీ దేవాలయం ఇలా ప్రతి దేవాలయం వద్ద ఆయా దేవాలయ నిర్వాహకులతో సీసీ కెమెరాలను పోలీసులు ఏర్పాటు చేయించారు. బంగారు దుకాణదారులు, బ్యాంకుల ప్రతినిధులతో వారితో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతో భద్రతకు పెద్ద పీట వేసినట్టైంది.



స్టేట్‌బ్యాంక్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలు

బాగా ఉపయోగపడుతున్నాయి

హిందూపురం పట్టణంతో పాటు గ్రామీణ మండలం పారిశ్రామికవాడలోనూ సీసీ కెమెరాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు బాగా ఉపయోగపడుతున్నాయి. ప్రధాన వీధుల్లో జరిగే చోరీలు, బైక్ దొంగతనాలు వంటివి సీసీ కెమెరాల్లో రికార్డు అవుతుండటంతో వాటిని ఛేదించడం సులువుగా మారింది. పట్టణంలో ఏవైనా వివాదాలు జరిగినప్పుడు కూడా ఫుటేజీలు ఉపయోగపడుతన్నాయి.



\- కృష్ణారెడ్డి, సీఐ

భద్రతా ఏర్పాట్ల పరిశీలన



గొల్లపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

పెనుకొండ రూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో భాగంగా ఎస్పీ మాధవరెడ్డి బుధవారం గొల్లపల్లి రిజర్వాయర్, కియా పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. డీఎస్పీ హుసేన్ పీరా, సీఐ కరుణాకర్ తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



హిందూపురం: తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హిందూపురంటౌన్/చిలమత్తూరు/మడకశిర రూరల్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని జిల్లా సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆగస్టు 1 నుంచి 7 వరకూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రిలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. చిలమత్తూరు, మడకశిర మండల పరిధిలోని కదిరేపల్లిలో కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

బాబు గిమ్మిక్కులను ప్రజలు నమ్మరు



ముతుకూరు గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ

గుడిబండ: 'ప్రతి పక్షనేత చంద్రబాబు నాయుడు అధికారం కోసం ఎన్ని గిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మరు.. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్ జగన్‌కే మళ్లీ ప్రజలు పట్టంకట్టడం ఖాయం' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముతుకూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెసుకున్నారు. ప్రభుత్వ పథకాల వలన ఆయా కుటుంబాలు ఎంత లబ్ధి పొందాయో వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు మరోసారి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం జగన్ అర్హతే ప్రామాణికంగా పేద ప్రదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 95 శాతం నెరవేర్చిన ఏకైక సీఎం జగనేనన్నారు. గ్రామాల్లో నెలకొన్న చిన్న, చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్ జగదాంబ, ఎంటీటీసీ సుశీల, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, రమేష్, వైస్ సర్పంచ్ నాగమణి, నాయకులు కిష్టప్ప, నాగేష్, శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలతో కలసి పెనుకొండ మండలంలోని చంద్రగిరి, గొల్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శంకరనారాయణ గడప గడపకూ తిరుగుతూ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రభుత్వ పనితీరుతో పాటు వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఎలా పనిచేస్తున్నాయంటూ నేరుగా ప్రజలనే అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగానే స్థానిక సమస్యలను కూడా అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. గొల్లపల్లి గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లలను అందించారు. ఎంపీడీఓ శివశంకరప్ప, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ గౌతమి, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సమత ఆదినారాయణరెడ్డి, వైశాలి జయశంకరరెడ్డి, మల్లికార్జున, వెంకటరాముడు, ముకుంద, ప్రసాద్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

హిందూపురం, టౌన్: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని సర్పంచ్ దేవరాజు, సూర్య రోషిని ఫౌండేషన్ ప్లాంట్ హెడ్ అఖిలేష్ సింగ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోళ్లాపురం గ్రామంలో ఆదర్శ గ్రామ పథకం కింద సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు 5 పండ్ల మొక్కలు చొప్పున 250 పండ్ల మొక్కలను పంపిణీ చేశారు.

గుడిబండ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆర్డీటీ ప్లాంటేషన్ టెక్నికల్ డైరెక్టర్ బీరలింగప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బైరేపల్లిలోని రైతుల పొలాల్లో ఆర్డీటీ సంస్థ అధ్వర్యంలో 1000 ఎర్రచందనం మొక్కలు నాటారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పరిగి: మండలంలోని కాలువపల్లి సమీపంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న వడ్డే నారాయణప్పను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. అతని వద్ద నుంచి 10 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు అనంతరం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

ఉపాధిపై సమీక్ష

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంతో బుధవారం ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సంఖ్య పెంచడానికి ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీసీఎల్ఆర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ నిధుల మళ్లింపుపై నిరసన

పావగడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 5 గ్యారంటీ స్కీములకు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల అభివృద్ధికి కేటాయించిన నిధులు రూ.11 వేల కోట్లను ఉపయోగించడం సరికాదని దళిత విద్యార్థి పరిషత్ నాయకులు ఆరోపించారు. ఇందులో భాగంగానే బుధవారం తాలూకా కార్యాలయంలో బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయప్ప, కర్ణాటక మాదిగ దండోరా జిల్లా ఉపాధ్యక్షుడు వళ్లూరు నాగేశ్ , ఈరణ్ణ, సౌమ్య, లావణ్య పాల్గొన్నారు.

12న సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మురళీ (28) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో మురళీ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునిది బుక్కరాయసముద్రం మండలం వడియంపేట అని పేర్కొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలోని ఎస్సీ, ఎస్టీలకు సొంతింటి కల నేరవేర్చడమే ఆర్డీటీ ధ్యేయమని ఆ సంస్థ ఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన అమరాపురం ఆర్డీటీ కాలనీలో 50 కుటుంబాల లబ్ధిదారులను స్పానిష్ బృందం సభ్యులు కలిశారు.

తప్పిన ప్రమాదం

చిలమత్తూరు: మండలంలోని కోడూరు మన్రోతోపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవనంపైకి 70 ఏళ్లనాటి చింత వృక్షం కూలిపోయింది. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే పాఠశాల సమయంలో జరిగుంటే పెను ప్రమాదం సంభవించేదని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో పాఠశాల భవనం పాక్షికంగా దెబ్బతింది.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మడకశిర: సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పెనుకొండరూరల్: గొల్లపల్లిలో పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



చిలమత్తూరు: ఆర్బీకేలో గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

మడకశిర/గుడిబండ: రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గుడిబండ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి కూడా ఆయన హాజరై మాట్లాడారు. బాలింతలు, గర్భిణులకు కిట్లను పంపిణీ చేశారు. అవకతవకలకు లేకుండా కిట్లను పక్కాగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ నాగమల్లేశ్వరి, తహసీల్దార్ ముర్తావలి, ఎంపీపీ కవిత, సింగల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి, డైరెక్టర్ నాగరాజగౌడ్, సీడీపీఓ పద్మావతి, జెడ్పీటీసీ భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్/లేపాక్షి/చిలమత్తూరు: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పేర్కొన్నారు. బుధవారం హిందూపురం మండలం పూలకుంట, లేపాక్షి, చిలమత్తూరు మండల కేంద్రాల్లో నిర్వహించిన జగనన్న సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీలో పాల్గొన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటరనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దివాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అమరనాథ్, సీడీపీఓ రెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి పేర్కొన్నారు. చౌళూరు పంచాయతీ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమానికి బుధవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నంజప్ప, ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని ఆర్డీటీ భవనంలో ఎంపీపీ రేణుక, సూపర్‌వైజర్ లీలవతి ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పోషణ కిట్లను అందజేశారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, సర్పంచ్ లక్ష్మమ్మ, వైస్ ఎంపీపీ నిర్మలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ పాల్గొన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలోని స్థానిక సచివాలయం-1 ఆవరణలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గర్భిణులను సామూహికంగా కూర్చోబెట్టి సీమంతం నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, సర్పంచ్ రామలక్ష్మమ్మ , సూపర్ వైజర్ సన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: పౌష్టికాహార లోప నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందించారు. సర్పంచ్ లక్ష్మీదేవి , ఎంపీటీసీ సభ్యురాలు లింగమ్మ, సెక్రటరీ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని హరేసముద్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ కరియన్న గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్దనున్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలంతలకు టేక్ హోమ్ రేషన్ సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, సూపర్ వైజర్ అనురాధ, సచివాలయాల సమన్వయకర్త ఆర్ఏ రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క తెలిపారు. బుధవారం మండలంలోని హలుకూరు, కె.శివరం, గౌడనకుంట తదితర గ్రామాల్లో సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కుంచిటి వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఈరక్యాతప్ప, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్య సిద్ధిస్తుందని తహసీల్దార్ స్వర్ణలత, కౌన్సిలర్ తయూబ్ పేర్కొన్నారు. పట్టణంలోని దర్గాపేటలో బుధవారం వైఎసార్ సంపూర్ణ ఆరోగ్య పోషక పథకం కింద లబ్ధిదారులకు కిట్లను అందజేశారు.

సోమందేపల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులు, బాలింతలకు సరఫరా చేసిన పౌష్టికాహారాన్ని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అందజేశారు. సోమందేపల్లిలోని అంగన్వాడీ కేంద్రం వద్ద సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉప సర్పంచ్ వేణు, ఈఓఆర్డీ నాగరాజురావు, సూపర్ వైజర్ శుభరాణి, ఎంపీటీసీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



అగళి: వైఎస్సార్ పోషణ కిట్లతో మహిళలు



పరిగి: పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

మణిపూర్ మారణహోమాన్ని అరికట్టండి

పెనుకొండ: మణిపూర్‌లో మారణహోమాన్ని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు నిరసనగా బుధవారం పట్టణంలో సీపీఎం నిరసన ర్యాలీ కార్యక్రమం చేపట్టింది. నాయకులు రమేష్, తిప్పన్న, బాబావలి, గంగాధర్, మహబూబ్‌భాష లతదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: బీజేపీ పాలనలో మణిపూర్ రాష్ట్రంలో చోటు చేసుకున్న హింసకు సంబంధించిన కరపత్రాలు బుధవారం సీపీఎం నాయకులు విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని సీపీఎం మండల కార్యదర్శి రాజ్ గోపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేష్, చాంద్ బాషా, మాబూ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



పనులు ప్రారంభిస్తున్న దీపిక

లేపాక్షి: నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా తెలిపారు. బుధవారం ఉదయం మండల కేంద్రమైన లేపాక్షిలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న షాదీమహాల్‌కు ప్రహరీ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. సర్పంచ్ ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, ముతవల్లీ హబీబ్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ప్రభాకర్ పాల్గొన్నారు.

దీపికకు సన్మానం

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు, కోడూరు, సోమఘట్టలకు నూతనంగా నియమితులైన సింగిల్‌విండో చైర్మన్లు దివాకర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, అమరనాథ్‌లు నియోజకవర్గ సమన్వయకర్త దీపికను ఘనంగా సత్కరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమెను శాలువాలతో సత్కరించారు.